బ్యాంకు దొంగలకు వత్తాసు దుర్మార్గం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశ ప్రధాని నరేంద్రమోదీ వంటి వ్యక్తులు బ్యాంకుల సొమ్మును దోచుకున్న దొంగలకు వత్తాసు పలకటం దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో 37వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రముఖమైన కాళేశ్వరరావు మార్కెట్ సముదాయంలో షేక్ ఆసిఫ్, ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేతతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ మార్కెట్‌లోని వ్యాపారులను కలుస్తూ ముందుకు సాగారు. మార్కెట్ వద్ద ఉన్న అల్పా హోటల్‌లో కొద్దిసేపు ఆసిఫ్, శ్వేతలు సందడి చేశారు. అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సుజనా చౌదరిని ఇద్దరూ గురుశిష్యులన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానని ఐదేళ్లు మోసం చేశారని ధ్వజమెత్తారు. అదే బాటలో సుజనా చౌదరి సైతం పశ్చిమ నియోజకవర్గాన్ని సింగపూర్ చేస్తానని, మలేషియాగా తీర్చిదిద్దుతానని హామీలిస్తూ ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సుజనాచౌదరి వంటి ఆర్థిక నేరాళ్లపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ముందు తాను ఎగేసిన బ్యాంకుల అప్పులు చెల్లించి ఆ తరువాత ప్రజలను ఓట్లు అడగాలన్నారు. విచ్చలవిడిగా ఓట్లు కొనుగోలు చేసి గెలవాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. అటువంటి అనైతిక నేతలను పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తరిమికొడతారని చెప్పారు. నియోజకవర్గంలో తమ ప్రభుత్వం రూ.450 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిందని వెల్లడించారు. సుమారు రూ.850 కోట్లు ప్రజల ఖాతాల్లో నేరుగా వేశారని వివరించారు.



కేజే మార్కెట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న షేక్ ఆసిఫ్, కేశినేని శ్వేత తదితరులు

ప్రజాజీవితంలోని లేని వ్యక్తి సుజనా...

సుజనాచౌదరి అనేక పదవులు చేపట్టినట్లు హడావుడి చేస్తున్నారని, కానీ ఇప్పటి వరకూ ఆయన ప్రజా జీవితంలో లేరని ఆసిఫ్ పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా 12 ఏళ్లు ఉన్న ఆయన ప్రజల చేత ఎన్నుకోబడలేదన్నారు. ముఖ్యంగా డబ్బులు చెల్లించి రాజ్యసభకు వెళ్లిన సుజనా అదే రీతిలో ఇక్కడ ఓట్లు కొనుగోలు చేసి చట్ట సభలకు వెళ్లాలని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశినేని శ్వేత మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఎంపీ కేశినేని నాని ఎంపిపి వేల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. విజయవాడను వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ కేశినేని నానిని, అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీతో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకులు గంధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ నివారణకు ఉచిత హోమియో మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రతి ఏటా దాతలు, భక్తుల సహకారంతో వేసవి ఎండల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు ఉచితంగా హోమియో మందుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ వర్మ నేతృత్వంలో హోమియో మందులు తయారుచేసి అందజేస్తున్నామని అన్నారు. హోమియో మందులు వేసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని అన్నారు. ప్రతి రోజూ ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వ్యాపారులకు అండగా జగనన్న ప్రభుత్వం

పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్, కేశినేని శ్వేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): వ్యాపారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) కుమార్తె శ్వేత తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు గురువారం గొల్లపూడి పరిధిలోని మహాత్మాగాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో విస్తృతంగా పర్యటించారు. కాంప్లెక్స్‌లోని ప్రతి షాపునకు వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వ్యాపారవర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు... వ్యాపారులకు ఎటువంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంప్లెక్స్ షాపుల్లో పని చేసే ముఠా కార్మికులను కలిసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)ని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను గెలిపించుకోవాలని కోరారు. పేద బతుకులు బాగుండాలంటే జగన్ ప్రభుత్వమే రావాలని చెప్పారు.

ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని తెలిపారు. మళ్లీ ఆయన్ని ముఖ్యమంత్రిని చేసుకుంటే భవిష్యత్‌లో పేదల బతుకులు మరింత బాగుంటాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంప్లెక్స్‌లో పని చేస్తున్న ముఠా కార్మికుల కుటుంబాలకు 80 శాతానికిపైగా జగన్ ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదలైన ముఠా కార్మికుల పిల్లలకు జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి వంటి సంక్షేమ పథకాలను అందించి వారి ఉన్నతికి సరికొత్త బాటలు వేసింది సీఎం జగనన్న ప్రభుత్వం మాత్రమేనని తెలిపారు. వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. పట్టణాల్లో వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య సేవలను ప్రజల ముంగిటకే తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగింపుకు జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సాధ్యమవుతుందన్నారు. పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాల ముగింపుకు మీరు ఒప్పుకున్నట్లే అవుతుందని, ఆలోచించి మంచి చేసిన వారిని గెలిపించుకోవాలని కోరారు.



వ్యాపారులకు కరపత్రం ఇస్తున్న ఆసిఫ్, కేశినేని శ్వేత



కాంప్లెక్స్‌లోని ముఠా కార్మికులతో ఆసిఫ్, కేశినేని శ్వేత

ట్రేడ్ అండ్ బిజినెస్ సెంటర్‌గా బెజవాడ...

విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) కుమార్తె కేశినేని శ్వేత మాట్లాడుతూ విజయవాడను ట్రేడ్ అండ్ బిజినెస్ సెంటర్‌గా మార్చటంతోపాటు చిన్న తరహా వ్యాపారస్తులను ఆదుకునేందుకు మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌లను అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి, ఎంపీ అభ్యర్థి కేశినేని నానికి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులుగా 10 సంవత్సరాలు పనిచేసి టాటా ట్రస్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత కేశినేని నానిదేనని పేర్కొన్నారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకర్లను అందజేసిన ఘనత కూడా కేశినేని నాని అన్నారు. వర్తక, వాణిజ్య రంగాల అభివృద్ధికి అవసరమైన రవాణా సౌకర్యం కోసం కేశినేని నాని కేంద్రంతో మాట్లాడి విజయవాడలో రెండు ఫ్లైఓవర్లు, పశ్చిమ బైపాస్ రహదారిని నిర్మించిన ఘనత ఆయనదేనని వివరించారు. ఎందుకంటే విజయవాడ అంటే అమితమైన ప్రేమ అని, అందుకే అంత అభివృద్ధి చేశారని తెలిపారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి కేశినేని నాని, షేక్ ఆసిఫ్‌లను గెలిపించుకోవాలని కోరారు. కమర్షియల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు పడుచూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు కాసుల వెంకట నారాయణ, బచ్చు రమేష్, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, పార్టీ నాయకులు నాళం నాగేశ్వరరావు, లలితా రైస్ బాషా, తోటేటి శ్రీకాంత్, తంగెళ్ల రాము, దేవర సురేష్, మండల శ్రీనివాస్, జేఎన్‌జీ అల్లాఫ్, ఇక్బాల్, ఎండీ గౌస్, దిద్దుకూరి శివ, మల్లిక్, వహీం, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణతో ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్నికలకు సంబంధించి చివరి 72 గంటల్లో చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక అమలు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజీలు, డీఐజీలు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, అధికారులతో కలిసి హాజరయ్యారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిబ్బందికి నాణ్యమైన శిక్షణనిచ్చామని అన్నారు. భద్రత విషయంలోనూ పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ లొకేషన్ వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 1,874 పోలింగ్ స్టేషన్లలో 900 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని... 1,267 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 544 మంది మైక్రో అబ్జర్వర్లు సేవలందించనున్నట్లు వివరించారు. ఈవీఎం ట్రబుల్ షూటింగ్ మెకానిజం తదితర అంశాలను కూడా కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

గృహ నిర్బంధంలో పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన అధినేత పవన్ కల్యాణ్ పశ్చిమ నియోజకవర్గ పర్యటనను పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్‌ను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. పవన్‌కల్యాణ్ రాకను పురస్కరించుకొని తనకు అన్యాయం చేసిన ఆయనకు నిరసన తెలియజేస్తానని పోలీసులు నుంచి మహేష్ అనుమతి కోరారు. దానికి పోలీసులు నిరాకరించారు. దీంతో పోతిన మహేష్ బయటకు రాకుండా ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదే సమయంలో జనసేనకు చెందిన కొంతమంది యువకులు వాహనాలపై పోతిన మహేష్ ఇంటి వీధి సమీపంలో హల్‌చల్ చేశారు. కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. కవ్వింపు చర్యలకు దిగితే ఊరుకునేది లేదని మహేష్ అనుచరులు హెచ్చరించారు.

అప్పారావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మూకల అప్పారావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో అప్పారావు సంతాప సభ నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఎన్టీఏ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, చిరంజీవిరావు, రమువర్మ తదితరులు అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో ఉపాధ్యాయ సంఘాల నేతలు మైనారావు, సీహెచ్ పద్మావతి, శ్రీను, రంగనాథ్‌రెడ్డి, నీలకంఠయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేస్తే ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ ఆస్పత్రి కృషి చేస్తుందని శంకర నేత్ర చికిత్సాలయ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదెళ్ల స్వాతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే మే 13వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకున్న వారికి ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వేలిపై సిరా ముద్ర చూపితే చాలని తెలిపారు. రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు ఫ్యాకో పద్ధతి ద్వారా చేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న హెల్త్ స్కీములు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విజయవాడ పరిసర ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మైనార్టీ ద్రోహులకు బుద్ధి చెప్పండి

జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైర్మెన్ షేక్ గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ బీజేపీ అభ్యర్థి, బ్యాంక్ దొంగ సుజనా చౌదరి విదిల్చే చిల్లర కోసం వేషాలు వేస్తున్న టీడీపీ మైనార్టీ ద్రోహులకు రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలే తగిన బుద్ధి చెప్పాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ పిలుపునిచ్చారు. ఇటీవల వరకు కేశినేని భవన్‌లో ఉంటూ ఎంపీ కేశినేని నానీ ఆదుగుజాడల్లో ఉన్న టీడీపీ మైనార్టీ నాయకులు ఒకరు ఆసిఫ్‌పై అసత్య ఆరోపణలు, బురద చల్లుడు వ్యాఖ్యలను ఖండిస్తూ విద్యాధరపురంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా, గౌస్ మొహిద్దీన్, పలువురు మైనార్టీ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రాజకీయ చైతన్యవంతమైన పశ్చిమ నియోజకవర్గంలో అన్ని మతాలు, కులాలు కలిసిమెలసి ఉన్నదమ్ముల్లా ఉంటుంటే వారి మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు వచ్చిన మతతత్వవాది సుజనా చౌదరి విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం టీడీపీ మైనార్టీ ద్రోహులు కొట్టుకుచస్తున్నారని ఎద్దేవా చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్ మొహిద్దీన్, జీఎంసీ బాషా తదితరులు

ఓటు కోసం వెతుక్కున్న సుజనా చౌదరి అనేక మంది ఓట్లర్లు నగరానికి ఏం చేశావని ఒక నాయకుడు అడిగితే పరాయి పౌరసత్వం... చంద్రబాబు పాలన చూసి ఓటేయాలా? మీరు బ్యాంకుల రుణాలను ఎగ్గొట్టి మోసం చేసినందుకు ఓటెయ్యాలా అని నిలదీస్తుంటే వాటికి సమాధానం చెప్పకుండా ఆసిఫ్‌పై ఏదో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. దొడ్డి దారిన రాజ్యసభకు వెళ్లి కేంద్ర మంత్రిగా కూడా పని చేసిన సుజనా విజయవాడకు ఏం చేశారని ప్రశ్నించారు. అప్పటి టీడీపీ ఎంపీగా ఉన్న కేశినేని నాని విజయవాడ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. మే 13న పోలింగ్ అయిపోగానే 14న ఢిల్లీ వెళ్లి పోయేందుకు ఫ్లైట్‌కు టికెట్ బుక్ చేశావా లేదా..భవానీపురంలో మీ క్యాంప్ ఆఫీస్ షెడ్ ఖాళీ చేసి ప్యాకప్ చేస్తుండటం నిజం కాదా? అని ప్రశ్నించారు. సుజనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కూడా ఒక ఆర్థిక నేరస్తుడని ఆరోపించారు. మైనార్టీల మనోభావాలను దెబ్బతీసేందుకు యత్నిస్తే మైనార్టీ టీడీపీ తొత్తులకు తగిన పరాభవం తప్పదని హెచ్చరించారు.

ఆసిఫ్‌పై అవాకులు చెవాకులు పేలితే సహించం

పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌పై అవాకులు చెవాకులు పేలితే సహించబోమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా హెచ్చరించారు. విజయవాడ పశ్చిమంలోని ముస్లిం మైనార్టీల కోసం ఇప్పటి వరకు మీరేం చేశారు. భవిష్యత్‌లో ఏం చేయనున్నారో చెప్పకుండా సొమ్ములకోసం ఆసిఫ్‌పై ఇష్టారాజ్యంగా మాట్లాడటం టీడీపీ మైనార్టీ నాయకులకే చెల్లిందన్నారు. స్థానికుడైన ఆసిఫ్ అందరికి అందుబాటులో ఉండే వ్యక్తి అని, సుజనా చౌదరి రేపు ఓడినా, గెలిచినా ఇక్కడ ఉండే వ్యక్తి కాదని పేర్కొన్నారు. అటువంటి టూరిస్ట్ పొలిటీషియన్‌కు ఓటు వేసి వృథా చేసుకోవద్దని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ గెలవటం, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

కొండ ప్రాంత పేదలకు మెరుగైన సౌకర్యాలు

ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) కుమార్తె కేశినేని శ్వేత హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రచార విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ నుంచి ప్రారంభించారు. తొలుత సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పర్డెర కాలనీ, నాగేంద్రస్వామి గుడి కొండపైన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులను కలిసి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. మొన్నటి వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఒక నెల ఒకటవ తేదీ వేకువ జామునే వలంటీర్ తలుపు తట్టి పింఛన్ ఇచ్చి వెళ్లేవారని, చంద్రబాబు మోకాలు అడ్డుపెట్టడంతో కిందటి నెల, ఈ నెల నానా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని కొండలు ఎక్కలేని పింఛనుదారులు శ్వేత దగ్గర ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన శ్వేత మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి వలంటీర్లు యథాతథంగా ఇంటికే వచ్చి పింఛన్ అందజేస్తారని భరోసా ఇచ్చారు.



ఎన్నికల ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ వారిని ఆప్యాయంగా పలకరిస్తున్న శ్వేత, రత్నకుమారి

చంద్రబాబుకు టీడీపీని విధంగా సుజనా చౌదరి అబద్ధాలు...

అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్య పెట్టడంలో చంద్రబాబుకు ఏ మాత్రం తీసిపోని వ్యక్తి సుజనా చౌదరి అని కేశినేని శ్వేత ఎద్దేవా చేశారు. 2014లో చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని, ఇప్పుడు టీడీపీ, జనసేన మేనిఫెస్టో పరిస్థితి కూడా అదేనని తెలిపారు. అందుకే చంద్రబాబు ఇచ్చే హామీలకు బీజేపీకి సంబంధం లేదని బీజేపీ సీనియర్ నేత రఘునాథబాబు చెప్పారంటే అర్థం చేసుకోవాలని కోరారు. మేనిఫెస్టోపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫొటోలు తప్ప మోదీ ఫొటో లేకపోవడంతో ఆ మేనిఫెస్టో కేవలం ప్రజలను మభ్యపెట్టే మోసం చేసేందుకేనని చెప్పారు. మే 13న జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మం గెలుస్తుందని, అధర్మం పక్షాన యుద్ధం చేస్తున్న కూటమికి ఓటమి తప్పదని పేర్కొన్నారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిషన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాసి జయప్రకాశ్, కెనడి, లేళ్లపూడి లాజర్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళిత మహిళ హోం మంత్రిపై దాడి హేయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే టీడీపీ నేత చంద్రబాబు మహిళలపై దాడులు చేయిస్తుండటం అత్యంత హేయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకుడు గోమతోటి వినోద్ పాల్ తెలిపారు. విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత మహిళ అయిన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితపై దాడి చేయడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని తెలిపారు. జగనన్న దళితులకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే మహిళలపై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. వన్‌టౌన్ పాత శివాలయం వైర్లెస్ బొమ్మ మధు మాట్లాడుతూ ఏం చేశావని పవన్ కల్యాణ్ విజయవాడ వచ్చారని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వంలో కాపు ఉద్యమ నేత, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని తీవ్రంగా అవమానించినప్పుడు కాపు నాయకుడని చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్ ఎందుకు చంద్రబాబును నిలదీయలేదని ధ్వజమెత్తారు. కుల రాజకీయాలు చేస్తున్న పవన్‌కు రానున్న ఎన్నికల్లో కాపులే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. విలేకరులతో ప్యాకేజ్ చెల్లించేందుకు సిద్ధంగా ఉంటున్నారు. జనసేనకు ఒక జెండా..ఎజెండా లేదన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్ ఇస్తే దానిని చదవటం ఒక్కటే పవన్‌కు తెలుసునన్నారు. సమావేశంలో పాశం శివ, కర్రి రమేష్, రుద్రపాటి ప్రవంతి, వడ్డాది అనిత, పీటల పద్మ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు పంపిణీ




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన వేద పాఠశాలలో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం పట్టాల పంపిణీ జరిగింది. పోలంకిలోని దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులకు బుధవారం వార్షిక పరీక్షలను నిర్వహించారు. 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారికి ఈవో కెఎస్.రామారావు పట్టాలను పంపిణీ చేశారు. పట్టాతో పాటు ప్రతి విద్యార్థికి రూ. 3 లక్షల ఎఫ్‌డీల రూపంలో ఆర్థిక సాయాన్ని అందచేశారు. విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవారిని, స్వామి వారిని ప్రార్థిస్తున్నామని ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వేదపాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్ముఖ శాస్త్రి, పర్యవేక్షకులు టీడీపీ దేవస్థానానికి చెందిన రెంటచింతల సోమయాజులు, అగిరిపల్లి వేద పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మి నరసింహ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి విశేష పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో కెఎస్.రామారావు పాల్గొన్నారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

అలరించిన హరికథ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తాడేపల్లి గూడెంకు చెందిన భాగవతారిణి శారదా హరికథ భక్తులను అలరించింది. అమ్మవారి సన్నిధిలోని దర్బపడం వేదికపై గురువారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం శారదా బృందం హరికథను ఆలపించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు హరికథను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం శారదా బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.